క్లుప్తంగా

నేడు మాజీ మంత్రి సీదిరి పూజలు

కాశీబుగ్గ: తిరుపతి లడ్డూ విషయం వివాదాస్పదమైన నేతృత్వంలో చంద్రబాబు పాప ప్రక్షాళన చేయడానికి ప్రత్యేక పూజలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా పలాసలోని ఉల్లాసపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, భక్తులంతా హాజరుకావాలని కోరారు.

ఆస్పత్రికి కుర్చీల వితరణ



సూపరింటెండెంట్‌కు కుర్చీలు అందజేస్తున్న దాత

టెక్కలి: ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ టెక్కలి జిల్లా ఆసుపత్రికి టెక్కలికి చెందిన మామిడి రాము అనే టీడీపీ కార్యకర్త తన తండ్రి రాజారావు జ్ఞాపకార్థం శుక్రవారం 20 కుర్చీలు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ బొడ్డేపల్లి సూర్యారావు, వైద్యులు లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక సదస్సు రేపు

టెక్కలి: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం టెక్కలిలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు బోకర నారాయణ రావు, చల్లా రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి ఆదిత్య కల్యాణ మండపంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సదస్సుకు మాజీ పార్లమెంట్ సభ్యుడు జి.వి.హర్ష కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలంతా హాజరుకావాలని కోరారు.

దోమల నివారణకు ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని శిలగాం సచివాలయంలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో భాగంగా దోమల నివారణ మందును శుక్రవారం ఫాగింగ్ చేశారు. గ్రామంలో జ్వరాలు రాకుండా, దోమల నివారణకు పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి నగిరి మన్మధరావు తెలిపారు.

విద్యార్థినికి అభినందనలు



ఏకాక్షరిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

టెక్కలి: కర్నూలులో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు టెక్కలి బాలికోన్నత పాఠశాలకు చెందిన గేదేల ఏకాక్షరి ఎంపికైనట్లు హెచ్ఎంఎన్.శోభారాణి, పీడీలు ఆదిశేషు, జగ్గమ్మ శుక్రవారం తెలిపారు. అథ్లెటిక్ పరుగులో భాగంగా 1500 మీటర్లు, 3000 మీటర్లు, క్రాస్ కంట్రీ పోటీల్లో ప్రతిభచూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

హిందీపై పట్టు సాధించాలి



రాజసింహ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

టెక్కలి : హిందీ భాషపై పట్టు సాధించాలని టెక్కలి మండలం చాకిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.అనురాధ అన్నారు. శుక్రవారం పాఠశాలలో హిందీ దివస్ పక్షోత్సవాలు నిర్వహించారు. హిందీని జాతీయ భాషగా మార్చేందుకు కృషి చేసిన రాజసింహ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టి.వైకుంఠరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

కంచిలి: జాడుపూడి పంచాయతీ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. పంచాయతీ కేంద్రంలో ఎమ్మెల్యే అశోక్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజులను శుక్రవారం గ్రామస్తులు పౌరసన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిలక చిన్నబాబు, కంచిలి, కవిటి మండలాల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రహసనంగా రైల్వే ప్రయాణం

- కిక్కిరిసిన జనరల్ బోగీలు
- బోగీ లోపలికి అడుగు పెట్టలేకపోతున్న సామాన్యులు
- పలాస రైల్వేస్టేషన్ వద్ద ప్రయాణికులకు తప్పని పాట్లు

కాశీబుగ్గ: జిల్లాలో అత్యధికంగా ప్రయాణికులు రాకపోకలు చేసే రైల్వేస్టేషన్‌లలో పలాస ఒకటి. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతం కావడంతో పాటు వ్యాపార పరంగా కూడా ప్రధానమైన పట్టణం కావడంతో అత్యధికంగా సూపర్‌ఫాస్ట్ రైళ్లకు ఇక్కడ స్టాపేజీ ఉంటుంది. అయితే కరోనా తర్వాత జనరల్ బోగీలు, స్లీపర్ బోగీలు బాగా తగ్గించడంతో సామాన్య ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా జనరల్ బోగిలోకి ప్రవేశించాలంటే సాహసం చేయాల్సిందే. ఖుర్దా రైల్వే డివిజన్ పరిధిలోని బరంపురం, వాల్తేరు డివిజన్‌లోని శ్రీకాకుళం రైల్వేస్టేషన్ మధ్య ఒక్క పలాసలోనే సూపర్‌ఫాస్ట్ రైళ్లకు స్టాపేజీ ఉండటంతో ఇక్కడ ప్రయాణికుల రద్దీ ఎక్కువ. ముఖ్యంగా పేదలు జనరల్ బోగీలపై ఆధారపడి రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారంతా ఇక్కడికి పెద్ద ఎత్తున చేరుకోవడంతో రోజూ ఇక్కడి బోగీల్లో తోపులాట చోటుచేసుకుంటుంది. శుక్రవారం భువనేశ్వర్ నుంచి చెన్నై వచ్చిన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ మెయిల్ (12839)ఎక్స్‌ప్రెస్‌లో కనీసం బోగీలోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు స్పందించి జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలని సామాన్య ప్రయాణికులు కోరుతున్నారు.



ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ మెయిల్‌లో కిక్కిరిసిన జనరల్ బోగి

రైతులకు న్యాయం చేయాలి



వ్యవసాయశాఖపై మాట్లాడుతున్న ఏఓ టి.భార్గవి

ఇచ్ఛాపురం రూరల్: రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని సభ్యులు విమర్శించారు. ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన శుక్రవారం ఇచ్ఛాపురం ఎంపీడీఓ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో వ్యవసాయ శాఖ తీరుపై ధ్వజమెత్తారు. రైతులకు, ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమాచారం తెలపకుండా వ్యవసాయ శాఖ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడం సరికాదని కేశుపురం సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు అన్నారు. టి.బరంపురం సర్పంచ్ కారంగి త్రినాథ్, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు మాట్లాడుతూ ప్రతీ ఆర్బీకేల్లో ఎరువులు కొరత లేకుండా చూడాలని, రైతు భరోసా సాయం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పంచాయతీ పరిధిలో సుమారు 200 మంది కిడ్నీ వ్యాధితో మృతి చెందారని, మూడు మంచినీటి ట్యాంకులు మంజూరు చేసిన అధికారులు రెండింటిని వెనక్కి తీసుకున్నారని, తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కేశుపురం సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది మార్చిలో హెల్త్ సెంటర్ ప్రారంభించినా సిబ్బంది హాజరవడం లేదని మండపల్లి సర్పంచ్ ప్రతినిధి పిట్ట మామయ్యరెడ్డి ప్రశ్నించారు. మత్స్యకార తీర ప్రాంతాలకు జల్‌జీవన్ మిషన్, ఉద్దానం మంచినీటి పథకం ద్వారా తాగునీరు అందించాలని వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి కోరారు. తల్లికి వందనం సొమ్ము జమకాక తల్లులు ఇబ్బందులు పడుతున్నారని ఈదుపురం సర్పంచ్ నర్తు వరప్రసాద్ యాదవ్ అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ సహాయకులు కె.రామారావు, ఎంఈఓ కె.అప్పారావు, సీడీపీఓ పి.నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

కానరాని మత్స్యకారుడి ఆచూకీ



మత్స్యకారులతో మాట్లాడుతున్న మెరైన్ పోలీసులు

సోంపేట : మండలంలోని బారువ కొత్తూరు గ్రామానికి చెందిన మత్స్యకారుడు రట్టి అప్పన్న సముద్రంలో గల్లంతై మూడు రోజులు కావస్తున్నా ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం నలుగురు మత్స్యకారులు బోటులో వేటకు వెళ్లగా..అప్పన్న గల్లంతైన విషయం తెలిసిందే. శుక్రవారం గ్రామంలోని మత్స్యకారులతో మెరైన్‌పోలీసులు మాట్లాడారు. గాలింపు చర్యలు చేపడుతున్నా అప్పన్న ఆచూకీ లభ్యం కాలేదని చెప్పారు. మరోవైపు ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు.

డ్వాక్రా బజారు ప్రారంభం



డ్వాక్రా బజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ : పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజారును ఎమ్మెల్యే గౌతు శిరీష శుక్రవారం ప్రారంభించారు. డ్వాక్రా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. డ్వాక్రా బజార్ కోసం స్థలం మంజూరు చేయాలని మహిళలు విజ్ఞప్తి చేయగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, పట్టణ నాయకులు గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, సవర రాంబాబు, ఎన్.శ్రీను, కమిషనర్ ఎన్.రామారావు, మెప్మా సీఎంఎం పిన్నింటి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కాశీబుగ్గ: ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలకు సంబంధించి శుక్రవారం కాశీబుగ్గ పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీ కోసం' నిర్వహించారు. సివిల్, ఆస్తి, కుటుంబ కలహాలకు సంబంధించి 12 వినతులు స్వీకరించారు. సమగ్ర విచారణ జరిపి న్యాయం చేస్తామని చెప్పారు. పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



శంకరంను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: ఆపస్(ఏపీయూఎస్) ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో 2024 సంవత్సరానికి గాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఇన్నేసుపేట ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ బి.శంకరం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడిని శుక్రవారం స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కీలు సోమేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు భాస్కర్ పాఢీ, వెంకటరమణ, మండల ప్రధాన కార్యదర్శి ఎం.తారకేశ్వరరావు, మల్లేశ్వరరావు, రాజు, సురేష్ పండా, మహేష్, మన్మధ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే విజయం ఖాయం



ఇచ్ఛాపురం రూరల్: పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో పాటు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ కురమాన అప్పారావు అన్నారు. గురువారం కె.శాసనాం ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం పథకం అమలు, నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల ప్రగతిపై ఆరా తీశారు. శతశాతం ఉత్తీర్ణత సాధించేలా బోధనపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.చిరంజీవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ అప్పారావు

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

టెక్కలి రూరల్: డ్రగ్స్, మాదకద్రవ్యాలతో జీవితం నాశనమవుతుందని టెక్కలి ఎస్ఐ రఘునాథరావు అన్నారు. రావివలసలో శుక్రవారం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గ్రామంలో ఎవరైన డ్రగ్స్ వాడినా, విక్రయించినా, అమ్మేవారికి సహకరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటరమణ, గ్రామపెద్దలు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పంటగా డ్రాగన్ ఫ్రూట్



కుండీలో పెరుగుతున్న డ్రాగన్ ఫ్రూట్

వజ్రపుకొత్తూరు రూరల్: పండ్ల జాతిలో ప్రత్యేకమైన డ్రాగన్ ఫ్రూట్‌లో అధికంగా పోషకాలు ఉండటంతో ఇటీవల కాలంలో గిరాకీ పెరిగింది. కేజీ పండ్లు నాణ్యత బట్టి రూ.200 నుంచి రూ. 500 వరకు ధర పలుకుతున్నాయి. దీంతో కొంత మంది ఇంటి ఆవరణ, కుండీల్లో సైతం సాగు చేస్తున్నారు. వజ్రపుకొత్తూరు మండలం సీతాపురంలో హనుమంతు మనోహర్ ఇంటి డాబాపై డ్రాగన్ ఫ్రూట్‌ను సాగు చేస్తుండటంతో స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ఆర్థిక అగ్రగామిగా భారత్

కాశీబుగ్గ : 2047 నాటికి ప్రపంచ ఆర్థిక అగ్రగామిగా భారత్ నిలుస్తుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం స్వర్ణాంధ్ర–2047 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉన్నతి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలోఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, ఐక్యూసీ కో–ఆర్డినేటర్ వెంకటరమణ, పీడీ మధు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని రాజాం కాలనీకి చెందిన పదిహేడేళ్ల బాలిక శుక్రవారం అదృశ్యమైంది. తల్లికి అనారోగ్య సమస్య కారణంగా తండ్రి శ్రీకాకుళం ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా అన్నయ్యతో పాటు ఇంట్లో ఉన్న బాలిక బహిర్భూమికని వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు తల్లిదండ్రులు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీటీపీసీ చైర్మన్‌కు సత్కారం



బాబూరావును సత్కరిస్తున్న నాయకులు

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కమిటీ చైర్మన్ (ఏపీటీపీసీ)గా ఎన్నికైన పలాస నాయకుడు వజ్జ బాబూరావును శుక్రవారం పలాసలోని ఆయన నివాసంలో బీజేపీ కార్యకర్తలు సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు లక్కోజు ధర్మారావు, ఇప్పిలి వెంకటరావు, చౌదరి కాశీప్రసాద్, నెమలిపురి రాజశేఖర్, వాసుపల్లి భాస్కరరావు పాల్గొన్నారు.

బొడ్డపాడు విద్యార్థుల ప్రతిభ



పలాస: బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఝాన్సీ 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హైజంప్‌లో..వి.మోహన్‌కృష్ణ, జె.భరత్, ఆర్.ప్రణీత్ కబడ్డీలో.. ఎస్.విజయ్‌కుమార్, బి.సోహిత్ వాలీబాల్‌లో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికయ్యారు. వీరిని హెచ్ఎం ఎ.వీర్రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు సి.ఆర్.రామ్‌జీ, ఉపాధ్యాయ సిబ్బంది పాఠశాలలో శుక్రవారం అభినందించారు.

బండారం బయటపడుతుందనే చంద్రబాబు కుట్ర

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్తుంటే సీఎం చంద్రబాబు కక్ష పూరితంగా అడ్డుకున్నారని వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ దుయ్యబట్టారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లడ్డూలో కల్తీ జరిగిందనే దుష్ప్రచారంతో సీఎం చంద్రబాబు ఇటీవల పెద్ద దుమారాన్ని లేపారని, ఈ పరిస్థితిలో వైఎస్ జగన్ తిరుపతిలో అడుగు పెడితే అసలు బండారం బయట పడుతుందనే భయంతో కావాలనే నోటీసులతో అడ్డుకున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ వ్యక్తులతో విధ్వంసాలు సృష్టించేందుకు పన్నాగం పన్నారని ఆరోగపించారు. ఎన్నికల హామీల నుంచి తప్పించుకోవడానికి, ప్రజల్ని పక్కదారి పట్టించేందుకు లెక్కలేని కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. కుల మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అయితే తన వల్ల తిరుపతిలో ఎటువంటి ఇబ్బందులు కలగకూడదనే ఆలోచనతో స్వామిపై ఉన్న భక్తితో వైఎస్ జగన్ తిరుపతి పర్యటనను రద్దు చేసుకున్నారని తిలక్ స్పష్టం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం టెక్కలి వైఎస్సార్ జంక్షన్‌లో వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రక్షాళన పూజలు, హోమం నిర్వహిస్తామని తెలిపారు.

బాహుదా నదిపై కొత్త వంతెన నిర్మించాలి



ఇంజినీర్ చీఫ్ నయిముల్లాకు వినతిపత్రం అందిస్తున్న సీడాప్ మాజీ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం/రూరల్: గత ఏడాది మేలో ఇచ్ఛాపురంలోని బాహుదానదిపై వందేళ్ల వంతెన సగ భాగం కూలిపోయిన నేపథ్యంలో కొత్త వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు విజయవాడలోని ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ చీఫ్ నయిముల్లాను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. విద్యా, వైద్య, వ్యాపారాల కోసం ప్రతి రోజు వేలాది వాహనాలు వెళ్లే ఈ వంతెన కూలిపోయిన స్థానంలో తాత్కాలిక వంతెన నిర్మించారని, దానిపై ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు తప్ప అంబులెన్స్, బస్సులు వంటి వాహనాలు రాకపోకలు సాగించేందుకు వీలులేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇంజినీర్లు కొత్త వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు చేపట్టారని గుర్తు చేశారు.

లింగవివక్షను రూపుమాపాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ప్రసన్నలత

కోటబొమ్మాళి: సమాజంలో లింగవివక్షను రూపుమాపాలని, మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలనూ చూడాలని కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బీఎంఆర్ ప్రసన్నలత అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళి జూనియర్ కళాశాలలో 'లింగ వివక్షత నిరోధించడం' అనే అంశంపై విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమన్నారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్‌కు బానిస కావద్దని హితవుపలికారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు, ఏజీపీ ఎస్.తిరుపతి, ప్రిన్సిపాల్ సంతోషిని పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలియజేస్తున్న హమాలీలు

కంచిలి: ఎం.ఎల్.ఎస్.పాయింట్లలో సేవలందిస్తున్న హమాలీల సమస్యల్ని ప్రభుత్వం పరిష్కరించాలని పలువురు హమాలీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయిస్ హమాలీ (ముఠా) వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం కంచిలిలో నిరసన తెలియజేశారు. కూలీ రేట్లను పెంపుదల చేసి, ఎరియర్స్‌తో కలిపి జి.ఓ. విడుదల చేయాలని, రూట్ ఆప్షన్ రద్దు చేయాలని, ప్రతి నెలా 10కల్లా నెల బిల్లులు చెల్లించాలని, పనిభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డొక్కరి దుర్యోధన, షణ్ముఖ, రామయ్య, మద్దు తులసయ్య, గణప దుర్యోధన, కొల్లి లచ్చయ్య, కాళ్ల గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకంతో దేశాభివృద్ధి



బహుమతులతో విద్యార్థులు

సోంపేట: పర్యాటక రంగం దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందని బారువ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.రామారావు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పర్యాటక రంగం ద్వారా ఉపాధి అవకాశాలు, తదితర విషయాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం వివిధ నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సహకారంతో పాఠశాల అభివృద్ధి



మాట్లాడుతున్న హెచ్ఎం ప్రకాశరావు

ఇచ్ఛాపురం రూరల్: పేరెంట్స్ కమిటీ భాగస్వామ్యంతో సర్కారు బడులు మరింత అభివృద్ధి చెందుతాయని మండపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాడు ప్రకాశరావు అన్నారు. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం కావాలంటే పేరెంట్స్ కమిటీ ఎప్పటికప్పుడు పాఠశాలకు వస్తూ పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో కమిటీ చైర్‌పర్సన్ మాయావతి బెహరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఇస్కలపాలేం విద్యార్థులు



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సోంపేట: మండలంలోని ఇస్కలపాలేం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని గండుపల్లి మోహిని పరుగు విభాగంలో, బి.సుమలత కబడ్డీ విభాగంలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైందని ఉపాధ్యాయులు శుక్రవారం తెలిపారు. వీరిని హెచ్ఎం జి.ధర్మారావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

హాస్టల్లో వార్డెన్ అందుబాటులో ఉండాలి



బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు

టెక్కలి: బాలికల వసతి గృహాల్లో వార్డెన్లు అందుబాటులో ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం టెక్కలిలో బాలికల సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేశారు. విద్యార్థుల మౌలిక వసతులపై ఆరా తీశారు. మెనూ ప్రకారం అందాల్సిన భోజనాలపై ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

రైతులకు ఈకేవైసీ తప్పనిసరి



ఈకేవైసీ నిర్వహిస్తున్న ఏఓ, వీఏఏ

కవిటి: ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా అందించే అన్ని పథకాలు, సేవల్ని పొందేందుకు రైతులు విధిగా ఈ–క్రాప్, ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బడగల దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని వివిధ రైతుసేవ కేంద్రాలలో ఈ–క్రాప్ అమలుతీరును పరిశీలించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 2822 మంది రైతులకు చెందిన 2663 ఎకరాల్లో వరి నాట్లుపడ్డాయని ఏఓ వివరించారు. 17రైతు సేవా కేంద్రాల్లో ఈ–క్రాప్, ఈకేవైసీ ప్రక్రియ జరుగుతోందన్నారు.